# సాక్షి
# విశాఖపట్నం

శుక్రవారం । 29 । ఆగస్టు । 2025



రెల్లివీధిలో సర్వమత సమ్మేళనం

కొబ్బరితోటలో దుర్గాదేవి రూపంలో..




లక్ష్మీటాకీస్ వద్ద వేంకటేశ్వరస్వామిగా..

## న్యూస్‌రీల్

### డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం


సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఉక్కునగరం: డీఎస్సీ–2025 ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన గురువారం ప్రారంభమైంది. డీఈవో ఎస్.ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో విశాఖ విమల విద్యాలయం పాఠశాలలో ఏర్పాటు చేసిన సర్టిఫికెట్ల పరిశీలన కోసం ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన అభ్యర్థులు హాజరయ్యారు. పరిశీలన కోసం పాఠశాలలో 24 రూమ్‌లను ఒక్కో రూమ్‌కు 50 చొప్పున 815 అభ్యర్థులకు కేటాయించారు. ప్రతీ రూమ్‌లో ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారి, ఎంఐఎస్ కోఆర్డినేటర్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లతో కూడిన బృందం సర్టిఫికెట్లను పరిశీలించారు. సర్టిఫికెట్ల పరిశీలన కోసం వచ్చిన ఒక మహిళా అభ్యర్థి తమ తండ్రి కుల ధృవీకరణ పత్రం తేవడంతో భర్త కుల ధృవీకరణ పత్రం తేవాలని చెప్పి సమర్పించడానికి కొంత వ్యవధి ఇచ్చారు. సర్టిఫికెట్ల పరిశీలన శుక్రవారం జరగనుంది.

### 2 నుంచి సింహగిరిపై పవిత్రోత్సవాలు



సింహాచలం: సింహగిరిపై వచ్చే నెల 2 నుంచి 6 వరకు పవిత్రోత్సవాలను విశేషంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. 2వ తేదీ సాయంత్రం 6 నుంచి రుత్విక్‌వరణం, మృత్సంగ్రహణం, అంకురార్పణ కార్యక్రమాలతో పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 3న ఉదయం 7 గంటల నుంచి శాంతిపాఠం, పవిత్రాధివాసం, యాగశాలార్చన, కుంభవాహనం, చక్రాబ్జమండలరచనం, పవిత్రప్రతిష్ఠ, సాయంత్రం 5 నుంచి గ్రామతిరువీధి ఉంటాయన్నారు. 4న ఉదయం విశేష ఆరాధన, హోమాలు, పారాయణాలు, సాయంత్రం తిరువీధి, రాత్రి పవిత్ర సమర్పణ నిర్వహించనున్నట్లు తెలిపారు. 5న ఉదయం పూర్ణాహుతి, పవిత్ర విసర్జనం, గ్రామతిరువీధి, 6న ఉదయం ఏకాంతస్నపనంతో పవిత్రోత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. పవిత్రోత్సవాలను పురస్కరించుకుని సెప్టెంబరు 2 నుంచి 6 వరకు నిత్యకల్యాణంతో పాటు అన్ని ఆర్జిత సేవలు బంద్ చేసినట్లు తెలిపారు.

### వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో జిల్లా నేతలకు చోటు

విశాఖ సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో జిల్లాకు చెందిన పలువురు నేతలకు చోటు దక్కింది. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలను చేపట్టినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటించింది. గాజువాకకు చెందిన చెరుకూరి హరీష్‌వర్మను రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శిగాను, విశాఖ ఉత్తర నుంచి బయ్యవరపు రాధాను రాష్ట్ర సాంస్కృతిక విభాగం ఉపాధ్యక్షురాలుగా, విశాఖ దక్షిణ నుంచి కణితుముచ్చు సాగర్‌ను రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శిగా నియమించారు.

### రికవరీ మొబైల్స్ అప్పగింత


ఫోన్లను అప్పగిస్తున్న జీఆర్పీ ఇన్‌స్పెక్టర్

తాటిచెట్లపాలెం : ప్రయాణికులు వివిధ రైళ్లలో, రైల్వేస్టేషన్లలో పోగొట్టుకున్న, మరచిపోయిన మొబైల్ ఫోన్స్‌ను గురువారం విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు అందజేశారు. రైల్వే స్టేషన్‌లో గల గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్ వద్ద సుమారు 25 లక్షలు విలువైన మొత్తం 100 ఫోన్లను సంబంధిత ప్రయాణికులకు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీసు పి.రామచంద్రరావు సూచనలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో జీఆర్పీ ఎస్‌ఐలు లక్ష్మి, ఎస్.రామారావు, విశాఖ క్రైమ్ టీం హెడ్ కానిస్టేబుల్ ఎల్.ఉదయ్‌భాస్కర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

### స్టీల్‌ప్లాంట్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా వినయ్‌కుమార్

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ నూతన డైరెక్టర్ (ఫైనాన్స్)గా సెయిల్ కార్పొరేట్ ఆఫీస్ ఫైనాన్స్ జనరల్ మేనేజర్ వినయ్ కుమార్ ఎంపికయ్యారు. కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో బుధవారం సెర్చ్ కమ్ సెలక్షన్ కమిటీ (ఎస్‌సీఎస్‌సీ) నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో 13 మంది అభ్యర్థులను పరిశీలించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ నుంచి నలుగురు, సెయిల్ నుంచి ఏడుగురు, ఎన్ఎండీసీ, ఎన్‌సీఎల్ ఇండియా లిమిటెడ్ నుంచి ఒక్కొక్కరు చొప్పున వచ్చిన దరఖాస్తుల్లో వినయ్ కుమార్‌ను ఎంపిక చేసినట్టు ప్రకటించారు.


బీచ్‌రోడ్డులో రెండు టన్నుల జర్మన్ సిల్వర్ వినాయకుడు



అల్లిపురంలో పంచముఖ వినాయకుడు

# గణనాథా.. బహురూపాయ

నగరంలో వివిధ ప్రాంతాల్లో కొలువుదీరిన గణనాథులు భక్తులను, సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సంప్రదాయబద్ధంగా రూపొందించిన విగ్రహాలతో పాటు, ఆధునిక పోకడలకు అనుగుణంగా, ట్రెండింగ్ కాన్సెప్టులతో తయారు చేసిన వినాయక విగ్రహాలు ప్రజలను ఆలోజింపజేస్తూ, ఆశ్చర్యపరుస్తున్నాయి. ఈ విగ్రహాలను చూసేందుకు నగరవాసులు కుటుంబసభ్యులతో కలిసి క్యూ కడుతున్నారు.

-ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్లు, విశాఖపట్నం

కంచరపాలెం లైబ్రరీలో గణనాథుడు



రెల్లివీధిలో మంచులో వినాయకుడు




పెదజాలారిపేటలో బోరు కొడుతూ..




గో సంరక్షణ రూపంలో..





కైలాసపురంలో, కంచరపాలెం రైతు బజార్ వద్ద ఆకట్టుకుంటున్న ఆపరేషన్ సింధూర్ వినాయకుడు


చిన్న వాల్తేర్‌లో కృష్ణుడిగా..


రెల్లివీధిలో బైక్ మెకానిక్ రూపంలో..

# మీ జాతకాలు నా దగ్గరున్నాయి!

- జాగ్రత్తగా పనిచేయండి
- ఎమ్మెల్యేలకు జనసేన అధినేత హితవు
- బాబు తరహాలోనే ర్యాంకులిస్తానంటూ ప్రకటన
- కార్యకర్తలను పట్టించుకోవడం లేదంటూ నేతలపై విమర్శలు
- అవినీతి ఆరోపణల్లో విశాఖ ఎమ్మెల్యేలే టాప్..!

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

'మీ జాతకాలు అన్నీ నా వద్ద ఉన్నాయి. ఎవరెవరు ఏమి చేస్తున్నారో నాకు తెలుసు. పదవి అనేది మనకు సేవ చేసేందుకు లభించిన అవకాశం. కానీ కొంత మంది తమ ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారనే విమర్శలున్నాయి. కనీసం మనల్ని నిలబెట్టిన కేడర్‌ను కూడా పట్టించుకోకుండా వ్యక్తిగత ప్రయోజనం కోసం మాత్రమే పనిచేస్తున్నారు. ఇది సరికాదు. ఎమ్మెల్యేల పనితీరు ఆధారంగా ర్యాంకింగ్ కూడా ప్రకటిస్తా మీ పద్ధతి మార్చుకోండి. లేదంటే నా తరహాలో నేను సరిదిద్దాల్సి వస్తుంది' అని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ హెచ్చరించారు. మూడు రోజుల పాటు విశాఖలో తలపెట్టిన జనసేన పార్టీ విస్తృత స్థాయి సమావేశాల్లో భాగంగా మొదటి రోజు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పని తీరు ఆధారంగా ర్యాంకులు ప్రకటిస్తానని తెలపడంతో పాటు ప్రతీ ఒక్కరి పనితీరును అంచనా వేసేందుకు ప్రత్యేక మెకానిజం కూడా ఉందని పేర్కొన్నారు. ప్రధానంగా మనకు అవకాశం కల్పించిన ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఎమ్మెల్యేల్లో మెజార్టీ సభ్యులపై ఎక్కువగా ఆరోపణలు వస్తున్నాయని.. వీటిని వెంటనే సరిదిద్దుకుని ముందుకు వెళ్లాలని హితవు పలికినట్టు తెలుస్తోంది. అదేవిధంగా మీ తీరు మారకపోతే నేను నా పద్ధతిలో చర్యలు తీసుకోవాల్సి వస్తుందని కూడా హెచ్చరించినట్టు సమాచారం. మొత్తంగా చంద్రబాబు తరహాలో ఎమ్మెల్యేల పనితీరును అంచనా వేస్తున్నామని తెలపడంతో పాటు ర్యాంకులు కూడా ఇస్తామని చెప్పడం గమనార్హం. విశాఖలో మూడు రోజుల పాటు జరుగుతున్న సమావేశాల్లో మొదటిరోజు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పార్టీ కార్యవర్గంతోనూ సమావేశమయ్యారు. ఈ నెల 30వ తేదీ వరకు ఈ సమావేశాలు కొనసాగనున్నాయి.

**ఉమ్మడి విశాఖ ఎమ్మెల్యేలే టాప్..!**

ఉమ్మడి విశాఖ జిల్లాలో జనసేనకు నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో ముగ్గురిపై భారీ స్థాయిలో ఆరోపణలు గుప్పుమంటున్నాయనే చర్చ జరిగినట్టు సమాచారం. మైనింగ్ నుంచి పోస్టింగుల వరకూ.. ప్రతీ పనికి ఓ రేటు కట్టి వసూలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. అంతేకాకుండా భూకబ్జా ఆరోపణలు కూడా వస్తున్నాయని పవన్ కల్యాణ్ పేర్కొన్నట్టు తెలుస్తోంది. ఏకంగా ఒక ఎమ్మెల్యేపై నేరుగా కొంత మంది చంద్రబాబుకే ఫిర్యాదు చేశారని తెలుస్తోంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకునే చంద్రబాబు కేబినెట్ సమావేశంలో జనసేన ఎమ్మెల్యేలతో మాట్లాడి సరిదిద్దుకోవాలని సూచించినట్టు కూడా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఉమ్మడి జిల్లాలోని ముగ్గురు ఎమ్మెల్యేల పనితీరుపై పవన్ పూర్తిస్థాయిలో అసంతృప్తిని వెలిబుచ్చినట్టు తెలుస్తోంది. ఒక ఎమ్మెల్యే మండలానికి ఒకరిని నియమించి వసూళ్లు చేపడుతుండగా.. మరో ఎమ్మెల్యే సోదరుడు మొత్తం పెత్తనమంతా చేస్తున్నారని కూడా పవన్ దృష్టికి వచ్చినట్టు సమాచారం. ఇక మరో ఎమ్మెల్యే అందినకాడికి దండుకుంటున్నారని కూడా పక్కా సమాచారం వచ్చినట్టు తెలుస్తోంది. మరో ఎమ్మెల్యేపై నేరుగా ఫిర్యాదులు లేకపోయినప్పటికీ.. ఆయన అల్లుడిపై పలు ఫిర్యాదులు వస్తున్నాయని కూడా పవన్ పేర్కొన్నట్టు చర్చ జరుగుతోంది. మొత్తంగా ఉమ్మడి జిల్లాలోని మొత్తం నలుగురి ఎమ్మెల్యేల పనితీరుపై పవన్ అసంతృప్తిని వెలిబుచ్చినట్టు ఆ పార్టీ నేతలే గుసగుసలాడుకుంటున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**చంద్రబాబు ఆదేశాలతోనే...!**

వాస్తవానికి గత నెలలో జరిగిన కేబినెట్ సమావేశంలో కూటమిలోని ఎమ్మెల్యేలపై విమర్శలు వస్తున్నాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇందులో భాగంగా టీడీపీ ఎమ్మెల్యేలను పిలిచి మందలించి పంపుతున్నానని.. బీజేపీ, జనసేన అధ్యక్షులు కూడా వారి ఎమ్మెల్యేలను పిలిచి తప్పులుంటే సరిచేసుకోవాలని చెప్పాలని సూచించారు. ఈ నేపథ్యంలోనే జనసేన ఎమ్మెల్యేలకు పవన్ క్లాస్ పీకారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంతేకాకుండా తమ ఎమ్మెల్యేలకు పనితీరు ఆధారంగా చంద్రబాబు తరహాలో రేటింగ్ కూడా ఇస్తానని చెప్పడం పట్ల జనసేన నేతలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. 'ప్రతీ పార్టీ పనితీరుకు ప్రత్యేకమైన విధానం ఉంటుంది. మరో పార్టీ స్టైల్‌ను ఫాలో కావడం మంచిది కాదు. చంద్రబాబు కేబినెట్ సమావేశంలో ఆదేశించారంటూ.. సొంత పార్టీ ఎమ్మెల్యేలను ఈ తరహాలో క్లాస్ పీకడం సరికాదు' అని సమావేశంలో పాల్గొన్న ఓ నేత అభిప్రాయపడ్డారు. అయితే, పార్టీ అధినేత నిరంతరం ఈ విధంగా సమావేశం కావడం మంచిదేనని.. కార్యకర్తలు చెప్పే సమస్యలు వింటే బాగుంటుందనే అభిప్రాయాన్ని కొందరు పార్టీ నేతలు వ్యక్తం చేస్తున్నారు.

### ఈఎస్ఐ స్ప్రీ-2025 పథకాన్ని సద్వినియోగం చేసుకోండి


స్ప్రీ పథకంపై అవగాహన కల్పిస్తున్న ఈఎస్ఐ గాజువాక బ్రాంచి మేనేజర్ లెంకా కృష్ణ ప్రసాద్

సీతంపేట: కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఎంప్లాయీస్ అండ్ ఎంప్లాయర్స్'(స్ప్రీ) 2025 పథకాన్ని సంస్థలు, కర్మాగారాలు సద్వినియోగం చేసుకోవాలని ఈఎస్ఐ కార్పొరేషన్ గాజువాక బ్రాంచి మేనేజర్ లెంకా కృష్ణ ప్రసాద్ కోరారు. లారస్ ల్యాబ్స్‌లో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఈఎస్ఐ చట్ట పరిధిలో నమోదు కాని సంస్థల కోసం ఈ పథకాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. పథకం జూలై 1 డిసెంబరు 31 వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కాలంలో నమోదు చేసుకునే సంస్థలు, వారు ప్రకటించిన తేదీ నుంచి మాత్రమే చందా చెల్లిస్తే సరిపోతుంది. అంతకు ముందు కాలానికి సంబంధించిన చందా కట్టనవసరం లేదు.నమోదుకు ముందు కాలానికి సంబంధించిన క్లెయిమ్‌లు, తనిఖీలు ఉండవు. ఈఎస్ఐలో నమోదు కాని ఉద్యోగులు కూడా ఈ పథకం ద్వారా నమోదు చేసుకోవచ్చునన్నారు. వారికి చందా, లాభాలు యాజమాన్యం ప్రకటించిన తేదీ నుంచి వర్తిస్తాయన్నారు.

### పెరిగిన మేహాద్రి నీటిమట్టం


గురువారం సాయంత్రం మేహాద్రి నీటిమట్టం

పెందుర్తి: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మేహాద్రి రిజర్వాయర్ నీటిమట్టం దాదాపు గరిష్ట స్థాయికి చేరుకుంది. రెండు రోజులుగా వర్షం తగ్గినా.. ఏజెన్సీ, మైదాన ప్రాంతాల నుంచి వరద నీరు ఉధృతంగా రావడంతో గంట గంటకు మేహాద్రి నీటిమట్టం పెరుగుతోంది. గురువారం సాయంత్రం నాటికి 58.7/61 అడుగులకు చేరుకుంది. రాబోయే ఒకటి రెండు రోజుల్లో వర్షం పడితే తక్షణమే గేట్లు ఎత్తే అవకాశాలు ఉన్నట్లు నీటిపారుదల శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాజు తెలిపారు.

# కబడ్డీ.. కబడ్డీ

- ఉరిమే ఉత్సాహం.. అదరగొట్టే యాక్షన్ సిద్ధం..
- నేటి నుంచి విశాఖ వేదికగా ప్రో కబడ్డీ 12వ సీజన్


ట్రోఫీ ఆవిష్కరణలో భాగంగా తొడగొడుతున్న 12 జట్ల కెప్టెన్లు

విశాఖ స్పోర్ట్స్: కబడ్డీ.. కబడ్డీ అంటూ కొదమ సింహాల్లా బరిలో నిలిచే ప్లేయర్లు సిద్ధమయ్యారు. అదరగొట్టే యాక్షన్ మొదలుకాబోతోంది. కబడ్డీ ప్రేమికులను ఉత్కంఠతో నిలబెట్టే ప్రో కబడ్డీ సీజన్–12 విశాఖ వేదికగా శనివారం ప్రారంభంకానుంది. ఈ సందర్భంగా గురువారం 12 జట్ల కెప్టెన్లు ట్రోఫీతో కలిసి ఫొటోలకు పోజిచ్చారు. పోటీకి సై అంటూ తొడకొడుతూ సవాల్ విసిరారు. ప్రముఖ క్రియేటర్లతో కలిసి మ్యాట్ మావెరిక్స్, రైడ్ మాస్టర్లు పేరిట రెండు జట్లుగా విడిపోయి కబడ్డీ ఆడారు. విశాఖ వేదికగా శుక్రవారం రాత్రి 8 గంటలకు తెలుగు టైటాన్స్–తమిళ్ తలైవాస్ మధ్య మ్యాచ్‌తో లీగ్ ఆరంభం కానుంది. ఈసారి ప్రో కబడ్డీ ఫార్మాట్‌లో మార్పులు చేశారు. తొలిసారిగా జట్లు రెండు గ్రూపుల్లో ఆడనున్నాయి. తెలుగు టైటాన్స్ జట్టు 'బి' గ్రూప్‌లో ఉంది. ప్రతి జట్టు లీగ్ దశలో 18 మ్యాచ్‌లు ఆడుతుంది. ప్లే–ఆఫ్స్‌తో పాటు 'ప్లే–ఇన్‌లు' కూడా ప్రవేశపెట్టారు. తొలి ఎనిమిది స్థానాల్లో నిలిచిన జట్లు ప్లే–ఇన్‌లు, ప్లే–ఆఫ్స్ ఆడతాయి. ఫలితం తేలని మ్యాచ్‌ల్లో విజేతను నిర్ణయించడానికి 'గోల్డెన్ రైడ్' విధానాన్ని తీసుకువచ్చారు. ఈ కొత్త ఫార్మాట్ భవిష్యత్తులో మరిన్ని లీగ్‌లలో అనుసరించవచ్చని ప్రో కబడ్డీ ఛైర్మన్ అనుపమ్ గోస్వామి తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈ సీజన్ ప్రారంభం కావడం విశేషం. గురువారం అంతర్జాతీయ క్రీడాకారుడు రాహుల్ చౌదరి వంటి వారిని సత్కరించారు. అలాగే సీజన్ ప్రారంభానికి ముందు కెప్టెన్లు ఐఎన్ఎస్ కురుసురను సందర్శించి సాయుధ దళాలకు నివాళులర్పించారు. ప్రో కబడ్డీ లీగ్–12ను స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించవచ్చు. ఈ సీజన్ టికెట్లను జొమాటో డిస్ట్రిక్ట్‌లో అందుబాటులో ఉంచారు.

# సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

మహారాణిపేట: ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం నగరంలో పర్యటించనున్న నేపథ్యంలో కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం కోస్టల్ బ్యాటరీ, నోవాటెల్, రాడిసన్ బ్లూ రిసార్ట్‌లలో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. కలెక్టర్ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చితో కలిసి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. నొవాటెల్‌లో జరిగే ఫుడ్ మానుఫ్యాక్చరింగ్ సమ్మిట్, రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో జరిగే గ్రిఫిన్ నెట్‌వర్కింగ్ మీటింగ్ ఏర్పాట్లను ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు. హెలిప్యాడ్, గ్రీన్ రూమ్, సీటింగ్ వంటి ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అధికారులను ఆదేశించారు.విద్యుత్, వైద్య, పారిశుధ్య పనులలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్ మీటింగు హాలులో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ జీఎం హనుమా నాయక్, ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జాయింట్ డైరెక్టర్ అన్షుమలి బాజ్ పాయి, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్‌లతో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏర్పాట్లపై సమీక్షించి పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, కృష్ణకాంత్ పాటిల్, డీఎఫ్‌వో రేణుకయ్య, పాల్గొన్నారు.


సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి

### విశాఖ చేరుకున్న మంత్రి లోకేష్

మహారాణిపేట: మంత్రి నారా లోకేష్ గురువారం విశాఖ చేరుకున్నారు. ఆయనకు పార్టీ నేతలు విమానాశ్రయంలో స్వాగతం పలికారు. శుక్రవారం నగరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఉదయం 10 గంటలకు వైజాగ్ కన్వెన్షన్‌లో జరిగే ఐసీఏఐ నేషనల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొంటారు. 11.30 గంటలకు చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌లో ఏఐ ల్యాబ్స్ ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో ఏఐ ల్యాబ్స్‌ను వర్చువల్‌గా ప్రారంభిస్తారు. మధ్యాహ్నం నోవాటెల్ హోటల్‌లో ఎయిరోస్పేస్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్‌పై సీఐఐ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు ఏయూ కన్వెన్షన్ హాల్‌లో జరిగే స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొంటారు. సాయంత్రం 6 గంటల తర్వాత రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో భారత మహిళా క్రికెట్ జట్టుతో మర్యాదపూర్వకంగా భేటీ కానున్నారు.

# భక్తి ముసుగులో అక్రమ వసూళ్లు

లంకా మైదానంలోని గణపతి మండపం వద్ద దారుణం

గాజువాక : పాత గాజువాక లంకా మైదానంలో ఎస్‌వీ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహం వద్ద నిర్వాహకులు అక్రమ వసూళ్లకు పాల్పడ్డారు. సుందర వస్త్ర మహాగణపతి దర్శనానికి విచ్చేసిన భక్తుల నుంచి డబ్బులు వసూలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న గాజువాక పోలీసులు విగ్రహం వద్దకు వచ్చి దర్శనాలను కొద్దిసేపు నిలిపివేశారు. ఆంక్షలకు తూట్లు పొడుస్తూ ఉత్సవ నిర్వాహకులు దర్శనానికి వచ్చేవారి నుంచి టికెట్ల పేరుతో వసూళ్లకు పాల్పడటంతో ఈ పరిస్థితి చోటుచేసుకుంది. భారీ వినాయకుడి మండపం వద్ద అర్చనలు, అన్న సమారాధన, వాహనాల పార్కింగ్, చెప్పులు భద్రపరచడం వంటి పేర్లతో వ్యాపారానికి తెరలేపడంతో పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. వినాయక మండపాల వద్ద కమర్షియల్ టికెట్లు ఉండకూడదని పెట్టిన నిబంధనలను ఎవరు ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటామని గాజువాక సీఐ పార్థసారథి హెచ్చరించారు.


తొలిరోజు టిక్కెట్లను విక్రయిస్తున్న మహిళ

### అలైడ్ హెల్త్‌కేర్ కోర్సులకు దరఖాస్తులు

మహారాణిపేట: గుర్తింపు పొందిన ప్రైవేట్ అలైడ్ హెల్త్‌కేర్ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు గురువారం తెలిపారు. వచ్చేనెల 8లోగా రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాల్సిందిగా సూచించారు. వివరాలను apsahpc.co.in పోర్టల్‌లో పొందుపర్చినట్లు వెల్లడించారు.

### నేడు రాష్ట్రస్థాయి ఫిన్‌టెక్ ఒలింపియాడ్

కొమ్మాది: యువ ప్రతిభను ప్రోత్సహించే ఉద్దేశంతో ఇండియన్ ఫిన్‌టెక్ ఫోరమ్ ఆధ్వర్యంలో శుక్రవారం గీతం యూనివర్సిటీలో రాష్ట్రస్థాయి ఫిన్‌టెక్ పోటీలు జరగనున్నాయి. ఈ విషయాన్ని ఇండియన్ ఫిన్‌టెక్ ఫోరమ్ సీఈఓ నిపాదత్త వెల్లడించారు. ఈ ఒలింపియాడ్‌లో భాగంగా, దేశ ఆర్థిక రంగం, ఆర్థిక అక్షరాస్యత, పెట్టుబడులకు సంబంధించిన అంశాలపై నిపుణులు విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని ఆయన తెలిపారు.

## తొట్లకొండకు చేరుకున్న సైకిల్ యాత్ర



అధికారులకు జ్ఞాపికను అందజేస్తున్న డీటీవో మాధవి

కొమ్మాది: శాంతి, ఐక్యత, సోదరభావం అనే సందేశాన్ని వ్యాప్తి చేస్తూ భారత త్రివిధ దళాల బృందం చేపట్టిన 'లార్డ్ బుద్ధ సర్క్యూట్ మోటార్ సైకిల్ యాత్ర' ప్రముఖ పర్యాటక కేంద్రమైన తొట్లకొండకు చేరుకుంది. ఈ యాత్ర బృందానికి పర్యాటక శాఖ అధికారిణి మాధవి సాదర స్వాగతం పలికి జ్ఞాపికను అందజేశారు. బృంద సభ్యుడు రాహుల్ పాటిల్ మాట్లాడుతూ ఈ యాత్ర కేవలం ఒక ప్రయాణం మాత్రమే కాదని, దేశాల మధ్య స్నేహాన్ని, బౌద్ధ వారసత్వాన్ని గుర్తుచేసుకునే ఒక గొప్ప యాత్ర అని తెలిపారు. శాంతి, ఐక్యత, సోదరభావాల ప్రాముఖ్యతను చాటి చెప్పేందుకే ఈ యాత్రను చేపట్టామని ఆయన వివరించారు.

## డీఎస్సీలో 3 శాతం స్పోర్ట్స్ కోటా అమలు

విశాఖ స్పోర్ట్స్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శుక్రవారం నగరంలో జరగనున్న కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ఏర్పాట్లను క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ రవినాయుడు స్వయంగా పర్యవేక్షించారు. ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో క్రడా దినోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. డీఎస్సీలో 3 శాతం స్పోర్ట్స్ కోటా కింద 421 పోస్టులను రాతపరీక్ష లేకుండా కేటాయించనున్నట్లు ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో వచ్చే అన్ని నోటిఫికేషన్లలోనూ ఈ స్పోర్ట్స్ కోటాను అమలు చేస్తారని తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్రంలోని ప్రముఖ క్రీడాకారులు హాజరు కానున్నారు. మంత్రి లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాకారులను సన్మానించనున్నారు. ఈ నెలలో 'అమరావతి చాంపియన్‌షిప్ ట్రోఫీ'ని నిర్వహించినట్లు, ఇకపై ఆగస్టు నెలను 'స్పోర్ట్స్ మంత్'గా జరపాలని ఆలోచిస్తున్నట్లు ఆయన తెలిపారు.



# మంత్రి గారూ.. ఇదీ పంచాయతీ తీరు..!



- ఖాళీ ఖజానాలతో పంచాయతీలు
- జిల్లాలో 79 పంచాయతీలకు రావాల్సిన నిధుల మళ్లింపు
- నిధుల కోసం సర్పంచ్‌లు ఎదురుచూపు
- బ్లీచింగ్ కొనడానికి ఇబ్బందులే..

మహారాణిపేట : జిల్లాలోని పంచాయతీలు తీవ్ర నిధుల కొరతతో కుదేలవుతున్నాయి. ప్రత్యేక నిధులు మంజూరైతే తప్ప అభివృద్ధి పనులు చేపట్టలేని దయనీయమైన పరిస్థితి నెలకొంది. రోజువారీ నిర్వహణకు కూడా నిధులు లేక సిబ్బంది అష్టకష్టాలు పడుతున్నారు. కొత్త వీధిదీపాలు, పైప్‌లైన్ల మరమ్మతులకు అవసరమైన విడి భాగాలు అప్పు చేసి కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ సమస్యపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తక్షణమే జోక్యం చేసుకుని నిధులు విడుదల చేయాలని సర్పంచులు విజ్ఞప్తి చేస్తున్నారు.

జిల్లాలోని మొత్తం 79 పంచాయతీలు – పద్మనాభం మండలం రెడ్డిపల్లిలోని మేజర్ పంచాయతీతో పాటు పెందుర్తి (15), భీమిలి (16), ఆనందపురం (26), పద్మనాభం (22)లోని పంచాయతీలు – ప్రధానంగా 15వ ఆర్థిక సంఘం నిధులు, జనరల్ ఫండ్స్‌పై ఆధారపడి ఉన్నాయి. ఈ ఏడాది ప్రారంభంలో కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసినప్పటికీ, కూటమి ప్రభుత్వం వాటిని మళ్లించిందని తెలుస్తోంది. దీంతో పంచాయతీలకు రావాల్సిన రూ.3.60 కోట్లు ఇంకా అందలేదు. ఈ నిధులను జనాభా ప్రాతిపదికన, ఒక్కో వ్యక్తికి రూ.600 చొప్పున కేంద్రం మంజూరు చేస్తుంది. ఇందులో టైడ్ కింద రూ.2.20 కోట్లు (మంచినీరు, పారిశుద్ధ్యం), అన్ టైడ్ కింద రూ.1.40 కోట్లు (పరిపాలన, సిబ్బంది జీతాలు) కేటాయించారు. ఈ నిధులు రాకపోవడంతో పంచాయతీలు ఎలాంటి ఖర్చులూ చేయలేని స్థితిలో ఉన్నాయి.

**జనరల్ ఫండ్స్ సైతం అందని ద్రాక్ష**

జనరల్ ఫండ్స్ కింద జిల్లాకు రావాల్సిన రూ.6.74 కోట్లు కూడా గత కొన్ని నెలలుగా విడుదల కాలేదని సమాచారం. భూముల రిజిస్ట్రేషన్లపై వచ్చే ఆదాయంలో 2 శాతం, పన్నులు, ఇతర మార్గాల ద్వారా లభించే నిధులు ప్రభుత్వం నుంచి తిరిగి పంచాయతీలకు రావడం లేదు. దీంతో గ్రామాల పరిస్థితి దిగజారుతోంది. పాడైన పైప్‌లైన్లను, వీధి దీపాలను మార్చలేక గ్రామాలు చీకటిలో మగ్గుతున్నాయి.

**పెండింగ్‌లో కార్మికుల జీతాలు**

పంచాయతీ నిర్వహణే కష్టంగా ఉంటే, కార్మికుల జీతాల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. క్లాప్ మిత్ర, షెడ్ మిత్రలకు సకాలంలో జీతాలు అందడం లేదు. ఆరు నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉండటంతో కార్మికులు అధిక వడ్డీలకు అప్పులు చేసి జీవిస్తున్నారు. తక్షణమే నిధులు విడుదల చేసి తమను ఆదుకోవాలని సర్పంచులు మంత్రి పవన్ కల్యాణ్‌ని కోరుతున్నారు.

**పవన్ జోక్యం చేసుకోవాలి**

ఈ సమస్యపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జోక్యం చేసుకుని తక్షణమే నిధులు విడుదల చేయాలని సర్పంచులు కోరుతున్నారు. నిధులు లేక పంచాయతీల నిర్వహణ కష్టంగా మారిందని, తక్షణం నిధులు విడుదల చేసి తమను ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



**పారిశుధ్యంపై పెను ప్రభావం**

అడపా దడపా కురుస్తున్న వర్షాల వల్ల గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. చెత్త పేరుకు పోవడంతో దోమలు పెరిగిపోయి, అనేక ప్రాంతాల్లో తాగునీరు కలుషితం అవుతోంది. దీంతో జ్వరాలు ప్రబలుతున్నాయి, ఇందులో డెంగీ కేసులు కూడా ఉండడంతో ప్రజల్లో భయం నెలకొంది. నిధులు లేకపోవడంతో కనీసం బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేసి రోడ్లపై చల్లలేని దుస్థితిలో సర్పంచులు ఉన్నారు.

## భారత్ మహిళా క్రికెట్ జట్టు ప్రాక్టీస్

విశాఖ స్పోర్ట్స్: ప్రపంచకప్‌కు సన్నాహకంగా భారత మహిళా క్రికెట్ జట్టు వ్యూహాత్మక శిక్షణా శిబిరం కోసం విశాఖ చేరుకుంది. బెంగళూరులో జరగాల్సిన ఈ శిబిరం అనూహ్యంగా విశాఖకు తరలించారు. వారం రోజుల పాటు జరిగే ఈ శిబిరంలో నైపుణ్యాల మెరుగుదల, ఫిట్‌నెస్, మ్యాచ్ పరిస్థితులను అనుకరించడం వంటి అంశాలపై దృష్టి సారించనున్నారు. ప్రపంచకప్‌లో భాగంగా భారత మహిళా జట్టు అక్టోబర్ 9న దక్షిణాఫ్రికాతో, అక్టోబర్ 12న ఆస్ట్రేలియాతో విశాఖలోని వైస్సార్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో మ్యాచ్‌లు ఆడనుంది. ఈ మ్యాచ్‌లకు అనుగుణంగా జట్టును సిద్ధం చేసేందుకే ఈ శిబిరాన్ని విశాఖకు మార్చారు. ప్రస్తుతం జట్టులోని కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన, స్నేహ్ రాణాకు మాత్రమే విశాఖలో ఆడిన అనుభవం ఉంది.

**కొత్తవారికి శిక్షణ :** ఈ ప్రపంచకప్‌లో భారత జట్టు తరఫున ఎనిమిది మంది కొత్త క్రీడాకారిణులు అరంగేట్రం చేయనున్నారు. వీరిలో ప్రతీక, జెమీమా, హర్లీన్, రాధ, అమన్‌జోత్ బ్యాటర్లు కాగా, అరుంధతి, శ్రీచరణి, క్రాంతి బౌలర్లు. ఈ శిబిరంలో ప్రధాన జట్టు సభ్యులతో పాటు, ఇండియా 'ఎ' జట్టుకు ఆడే క్రీడాకారిణులు కూడా పాల్గొంటున్నారు. అలాగే, రెండు ఇంట్రా–స్క్వాడ్ డే–నైట్ మ్యాచ్‌లు కూడా నిర్వహించనున్నారు, ఇవి స్టేడియంలోని లైట్ల కింద ఆడే పరిస్థితులకు అలవాటు పడటానికి సహాయపడతాయి.

**ప్రధాన మ్యాచ్‌లు విశాఖలోనే.. :** భారత మహిళా జట్టు దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాతో తలపడే కీలక మ్యాచ్‌లు విశాఖ వేదికగానే జరగనున్నాయి. అక్టోబర్ 9న దక్షిణాఫ్రికాతో, అక్టోబర్ 12న ఆస్ట్రేలియాతో భారత జట్టు తలపడనుంది. ఈ రెండు మ్యాచ్‌లు డే–నైట్ మ్యాచ్‌లుగా జరగనున్నాయి. ప్రపంచకప్‌కు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. ప్రపంచకప్ మ్యాచ్‌లు సెప్టెంబర్ 30న ప్రారంభమై నవంబర్ 2న ముగుస్తాయి. డేనైట్‌గా జరిగే అన్ని మ్యాచ్‌ల్లోనూ అక్టోబర్ 9న దక్షిణాఫ్రికాతో పోటీపడనుండగా 12న ఆస్ట్రేలియాతో తలపడనుంది. అక్టోబర్ 13న బంగ్లాదేశ్‌తో దక్షిణాఫ్రికా, 16న ఆస్ట్రేలియాతో బంగ్లాదేశ్ మ్యాచ్‌లతో పాటు..అక్టోబర్ 26న ఇంగ్లాండ్–న్యూజిలాండ్ మధ్య చివరి మ్యాచ్ జరగనుంది.

## నేడు డబుల్ డెక్కర్ బస్సు ప్రారంభం

దాబాగార్డెన్స్: నగర పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టిన 'హాప్ ఆన్..హాప్ ఆఫ్' డబుల్ డెక్కర్ ఎలక్ట్రికల్ బస్సులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం ఆర్‌కే బీచ్ వద్ద ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ గురువారం ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆర్‌కే బీచ్‌లోని కాళీమాత ఆలయం సమీపంలో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి అవసరమైన స్టాళ్లు, టికెట్ కౌంటర్లు, పోడియం, మైక్ సిస్టమ్, బ్యాక్‌డ్రాప్, జెండాలు, క్యాప్స్, టీ షర్టులు వంటివి సిద్ధం చేయాలని జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్ సత్యనారాయణ రాజు, జిల్లా పర్యాటక, సాంస్కృతిక అధికారి మాధవి, ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్ అప్పలనాయుడులకు సూచించారు.బస్సు డ్రైవర్లు, గైడ్‌లకు యూనిఫాంలు సిద్ధం చేయాలని, టికెట్లు, టికెటింగ్ మిషన్లను పరిశీలించి వాటిని అందుబాటులో ఉంచాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో బీచ్ రోడ్లు, ఫుట్‌పాత్‌లపై చెత్త లేకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని జోనల్ కమిషనర్లు శివప్రసాద్, మల్లయ్యనాయుడును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు కృష్ణంరాజు, బి. ప్రసాదరావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో విపరీత పోకడలు నిలువరించాలి

విశాఖ సిటీ: సామాజిక మాధ్యమాల్లో మహిళలపై జుగుప్సాకరంగా జరుగుతున్న దాడిని అడ్డుకునే విధంగా జనసేన పార్టీ ప్రజా ప్రతినిధులు అసెంబ్లీ వేదికగా మాట్లాడాలని జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. విస్తృత స్థాయి సమావేశాల్లో భాగంగా విశాఖ వేదికగా మొదటి రోజు జరిగిన పార్టీ లెజిస్లేటివ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీనిపై సమష్టిగా చర్చించి అసెంబ్లీలో చట్టం లేదా ఆర్డినెన్స్ తీసుకువచ్చేలా పనిచేద్దామన్నారు. దీనిపై నిపుణులతో ప్రత్యేకంగా రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి సూచనలు తీసుకుందామన్నారు. నియోజకవర్గంలో ఎటువంటి సమస్య ఉన్నా.. తన దృష్టికి తీసుకువస్తే తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యేలకు భరోసా ఇచ్చారు. మంత్రి నాదెండ్ల మనోహర్, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, లోకం మాధవి ప్రవేశపెట్టిన తీర్మానాలను ఆమోదించారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## ఫ్లెక్సీలో ఎంపీ భరత్ ఫొటో లేపేశారు

మరోసారి బయటపడ్డ గంటా–భరత్ మధ్య విభేదాలు



ఎంపీ భరత్ ఫొటో లేకుండా మధురవాడలోని స్త్రీశక్తి పథకం వేదిక వద్ద ఫ్లెక్సీ

తగరపువలస: భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎంపీ ఎం. శ్రీభరత్‌ల మధ్య వివాదం ముదురుతోంది. మధురవాడ వి కన్వెన్షన్‌లో సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా నిర్వహించిన 'స్త్రీశక్తి' కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ ఫొటోలు ఫ్లెక్సీల మీద లేకపోవడం ఈ వివాదానికి కారణమైంది. టీడీపీకి చెందిన ఎంపీ, జిల్లా అధ్యక్షుడి ఫొటోలను ప్రోటోకాల్ ప్రకారం ఫ్లెక్సీలపై వేయకపోవడంపై స్థానిక మహిళా ప్రతినిధులు, కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వివాదం కొత్తదేమీ కాదు. ఇటీవల భీమిలి జీవీఎంసీ జోన్ 2, 3 వార్డుల అధ్యక్షుల నియామకంలోనూ స్థానిక నాయకులు గంటా శ్రీనివాసరావుతో విభేదించారు. అప్పట్లో వారంతా ఎంపీ శ్రీభరత్, జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీని కలిసి తమకు అన్యాయం జరిగిందని ఫిర్యాదు చేశారు. ఆ వివాదం తాత్కాలికంగా సద్దుమణిగినట్లు కనిపించినా, తాజాగా జరిగిన ఫ్లెక్సీ వివాదం మరోసారి విభేదాలను బహిర్గతం చేసింది. కాగా ఎంపీ శ్రీభరత్ తోడల్లుడు, మంత్రి నారా లోకేష్ శుక్రవారం మధురవాడలో పర్యటించనున్నారు. ఈ ప్రోటోకాల్ వివాదాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లాలని భీమిలి నాయకులు సిద్ధమవుతున్నారు.

## కేకే లైన్‌లో రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ కేకే లైన్ పరిధిలో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు, కొన్ని రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖ–కిరండూల్(18515) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29, 31వ తేదీల్లోనూ, కిరండూల్–విశాఖ(18516) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 30, సెప్టెంబరు 1వ తేదీల్లో రద్దు చేశారు.

**గమ్యం కుదించిన రైళ్లు :** ఈ నెల 30, సెప్టెంబరు 1వ తేదీల్లో విశాఖపట్నం–కిరండూల్(18515) నైట్ ఎక్స్‌ప్రెస్ జగదల్‌పూర్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 29, 31, సెప్టెంబరు 2వ తేదీల్లో కింరడూల్–విశాఖపట్నం (18516) నైట్ ఎక్స్‌ప్రెస్ జగదల్‌పూర్ నుంచి బయల్దేరుతుంది. • ఈ నెల 30, 31, సెప్టెంబరు 1వ తేదీల్లో విశాఖ–కిరండూల్(58501) పాసింజర్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 30, 31, సెప్టెంబరు 1వ తేదీల్లో కిరండూల్– విశాఖ(58502) పాసింజర్ కోరాపుట్ నుంచి బయల్దేరుతుంది.

## బాలల హక్కుల పరిరక్షణకు సమన్వయం అవసరం

మహారాణిపేట: బాలల హక్కుల పరిరక్షణ కోసం అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ కోరారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో జరిగిన జిల్లా స్థాయి బాలల సంరక్షణ కమిటీ సమావేశంలో ఆయన ఆయన మాట్లాడుతూ బాలల విద్య, బాల్య వివాహాల నిషేధం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ, సివిల్ జడ్జి ఆర్. సన్యాసినాయుడు, జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ అధికారిణి కె.వి. రామలక్ష్మి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జింక్ గేటు సమీపంలో కారు దగ్ధం



దగ్ధమవుతున్న కారు

మల్కాపురం : జింక్ గేట్ సమీపంలో గురువారం ఉదయం ఓ కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కారు యజమాని కారును స్టార్ట్ చేస్తున్న సమయంలో ఇంజిన్ నుంచి నల్లటి పొగ వచ్చి, అనంతరం మంటలు వ్యాపించాయి. దీంతో వెంటనే కారు దిగిన యజమాని ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఏడు రోజులుగా కారు అక్కడే నిలిపి ఉంచినట్లు సమాచారం. అటుగా వెళ్తున్న వాహనదారులు మంటలను చూసి భయాందోళనలకు గురయ్యారు. కొంతమంది మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే కారు 60 శాతం కాలిపోయింది. ఈ ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

## డీసాలినేషన్ ప్లాంట్ పనులు వేగవంతం చేయాలి

దాబాగార్డెన్స్: అప్పికొండ ప్రాంతంలో జీవీఎంసీ నిర్మిస్తున్న 100 ఎంఎల్‌డీ డిసాలినేషన్ ప్లాంట్ పనులు వేగవంతం చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం జీవీఎంసీ నిర్మించనున్న 100 ఎంఎల్‌డీ డిసాలినేషన్ ప్లాంట్ ఏర్పాటు ప్రక్రియపై ప్రధాన ఇంజనీర్ పల్లంరాజు, తాగునీటి విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కేవీఎన్ రవి, పర్యవేక్షక ఇంజనీర్ ఏడుకొండలు ఇతర అధికారులు, ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ అసెట్ మేనేజ్‌మెంట్, ఇజ్రాయిల్‌కు చెందిన ఐడీఈ టెక్నాలజీస్ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం ప్లాంట్ నిర్మాణానికి రూ.1200 కోట్లు ఖర్చు అవుతుందని, దీనిని పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ కింద ఏర్పాటుకు నిర్ణయించడమైందన్నారు. ఇప్పటికే అనుభవం ఉన్న ఐడీఈ టెక్నాలజీస్ ముంబైలో 400 ఎంఎల్‌డీ, తమిళనాడులో 60 ఎంఎల్‌డీ డిసాలినేషన్ ప్లాంట్లు అభివృద్ధి చేసిందన్నారు. ఈ ప్రాజెక్టు చేపట్టేందుకు ఐడీఇ టెక్నాలజీస్ సాంకేతిక భాగస్వామిగా వ్యవహరిస్తుందని తెలిపారు.

**గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను సమర్థవంతంగా నిర్వహించండి**

జీవీఎంసీ పరిధిలో గల గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు సమర్థవంతంగా నిర్వహించాలని కమిషనర్ కేతన్ గార్గ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ప్రధాన ఇంజినీర్ పల్లంరాజు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, మెకానికల్ విభాగం ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సీఎల్‌ఏపీ వెహికల్, గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద 45 నిమిషాలు వేచి ఉండి, సీసీఎస్ హోపర్ యూనిట్‌తో చెత్త వేయాలని, ఒకవేళ సీసీఎస్ హోపర్‌లో కాకుండా, కింద ప్లాట్‌ఫాంపై చెత్త వేసినట్టయితే ఆ డ్రైవర్ జీతంలో కోత విధించాలని ఆదేశించారు.

## బ్లాస్ట్‌ఫర్నేస్‌లో కాపర్ స్టేవ్స్ చోరీపై ఫిర్యాదు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగంలోని ఆరు కాపర్ స్టేవ్స్ చోరీకి గురయ్యాయి. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగంలో ఈ ఏడాది జూన్‌లో జరిగిన బీఎఫ్–3 పునరుద్ధరణలో భాగంగా తొలగించిన 45 స్టేవ్స్‌ను విభాగం మెకానికల్ స్టోర్స్‌లో దాచారు. వాటిని జూన్ 12న వేలం వేశారు. వేలం దక్కించుకున్నవారు వాటిని తీసుకెళ్లలేదు. ఈ నెల 22న విభాగం సీనియర్ మేనేజర్ కె.రవికుమార్ తనిఖీ చేయగా ఆరు స్టేవ్స్ తక్కువగా ఉన్నాయి. దీంతో వారు స్టోర్స్ ఇన్‌చార్జ్, సీనియర్ మేనేజర్ ఆర్.సురేష్‌బాబు, డీజీఎం టి.వేణుగోపాల్‌కు సమాచారం అందించారు. రూ.25 లక్షల విలువైన స్టేవ్స్ చోరీపై విభాగం మెకానికల్ జీఎం పి.ఎస్.వెంకటేశ్వర్లు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.